

డిప్యూటేషన్లను విరమించుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): సమ్మె చేస్తున్న కేజీబీవీ ఉపాధ్యాయుల స్థానంలో ప్రభుత్వఉపాధ్యాయుల డిప్యూటేషన్‌లను విరమించుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు 25 రోజులుగా సమ్మె చేస్తుండగా వారి డిమాండ్లను పరిష్క రించకుండా డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయులను నియమించడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు శాంతికుమారి, తదితరులు పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీకి విశేష స్పందన
- ముందే వచ్చిన సంక్రాంతి
- తెలుగు సంస్కృతికి దర్పణం పట్టిన రంగవల్లులు
- ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు, యువతులు, చిన్నారులు
- పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కన్సోలేషన్ బహుమతి


ముగ్గులు వేస్తున్న మహిళలు

అతివలు మురిసె.. ముగ్గులు విరిసె..

కాగజ్‌నగర్/ ఆసిఫాబాద్/ ఆసిఫాబాద్‌రూరల్/ సిర్పూరు(టి)/ రెబ్బెన/ కాగజ్‌నగర్ టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ ఆధ్వర్యంలో కాగజ్ నగర్ పట్టణంలోని ఎస్పీఎం క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలకు విశేష స్పందన వచ్చింది. మహిళలు తెలంగాణ, తెలుగు సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేసిన ముగ్గులు వారం రోజుల ముందే సంక్రాంతి రంగుల హరివిల్లును ఆవిష్క రించింది. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్, సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు, గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా(ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్), స్థానిక స్పాన్సర్స్ సిర్పూర్ పేపర్ మిల్, అరుణ సర్వీస్, సర్వీసెస్ ఫ్రాంచాయిస్, ఈ డిజిటల్ సువిధాసెంటర్ నిర్వహించిన ముత్యాలముగ్గుల పోటీలు ఘనంగా జరిగాయి. ఉదయం పదిగంటల నుంచి 12గంటల వరకు ముగ్గుల పోటీలు జరిగాయి. ఈ ముగ్గుల పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 53 మంది మహిళలు, యువతులు, చిన్నారులు పాల్గొన్నారు. రంగురంగుల ముగ్గులు వేశారు. అనంతరం న్యాయనిర్ణేతలు అడ్వకేట్ శశిరేఖ, డీఐఈవో కళ్యాణి, స్పర్శ మేనేజర్ రీనా బిల్వాల్ ముగ్గులను పరిశీలించి ప్రథమ, ద్వితీయ, తృతీయవిజేతలను ఎంపిక చేశారు. ప్రథమ బహుమతి గోలేటికి చెందిన బత్తుల సరిత, ద్వితీయ బహుమతి తిర్యాణికి చెందిన పిడుగు జయ, తృతీయ బహుమతి గోలేటి టౌన్‌షిప్‌కు చెందిన సుమలత గెలుచుకున్నారు. విజేతలకు ఎస్పీఎం యూనిట్ హెడ్ ఏకే మిశ్రా, జీఎం ఎంఎస్ గిరి, చీఫ్ మేనేజర్ రమేష్‌రావు బహుమతులను అందజేశారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీఎం యూనిట్ హెడ్ ఏకే మిశ్రా మాట్లాడుతూ మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకత ఆలోచనలను బయటపెట్టేందుకు ఇలాంటి ముగ్గులపోటీలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. మహిళల్లో ప్రతిభను వెలికి తీసేందుకు 'ఆంధ్రజ్యోతి' ఇలాంటి పోటీలు నిర్వహించడం హర్షనీయమని ప్రశంసించారు. మీడియా సంస్థగా కేవలం వార్తల సేకరణకే కాకుండా తనవంతు సామాజిక బాధ్యతను గుర్తెరగంవల్లే ఇలాంటి కార్యక్రమాలు చేపడుతు న్నారని భావిస్తు న్నట్లు పేర్కొన్నారు. మహిళలు అందరూ చాలా చక్కగా ముగ్గులను అలంకరించి ప్రాంగణానికే వన్నెతెచ్చారని కొనియాడారు. వారం రోజుల ముందే సంక్రాంతి పండుగను ఆవిష్కరిం చారని ప్రశంసించారు. ఎస్పీఎం జీఎం ఎంఎస్ గిరి మాట్లాడుతూ పోటీలో గెలుపు ఓటమి కాకుండా కొంత మెరుగ్గా వేసిన వారిని విజేతలుగా ప్రకటిం చారే తప్ప ఇందులో ఎవరు ఎక్కువా తక్కువా కాదని అన్నారు. మున్ముందు 'ఆంధ్రజ్యోతి' మరిన్ని కార్యక్రమాలు చేపట్టి తనవంతు సామాజిక బాధ్యతను నెరవేర్చాలన్నారు. ఇలాంటి పోటీలు దేశ సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించుకునేందుకు ఎంతగానో దోహదపడతాయన్నారు.

కార్యక్రమంలో కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ఆంధ్రజ్యోతి రిపోర్టర్లు ఎ కృష్ణంరాజు, ఎన్ వేణుగోపాల్, వీటి చారి, గందం శ్రీనివాస్, ఎస్ సంపత్‌కుమార్, సయ్యద్ నాజీర్‌అలీ, రాజు, అజయ్, యాడ్స్ విభాగం ప్రతినిధి సతీష్, పీఈటీలు అనీల్, అశోక్, స్పర్శ ఫీల్డు అధికారిణి సుశీల, నాయకులు దాసరి నరేందర్, ఎం సుభాష్, హార్ట్‌ఫుల్‌నెట్ మెడిటేషన్ ట్రైయినర్ కెఆర్ నర్సయ్య, భారత్‌క్లాత్ స్టోర్ యాజమాని రాజేష్, లారీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.


పోటీల్లో పాల్గొన్న వారితో స్థానిక స్పాన్సరర్లు, న్యాయనిర్ణేతలు, ఆంధ్రజ్యోతి సిబ్బంది


మొదటి బహుమతి అందజేస్తున్న ఎస్పీఎం యూనిట్ హెడ్ ఏకే మిశ్రా


ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు, ఆంధ్రజ్యోతి సిబ్బంది

● చక్కటి ముగ్గులు వేశారు..
-శశిరేఖ, న్యాయవాది, కాగజ్‌నగర్, (న్యాయ నిర్ణేత)
'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాలముగ్గుల పోటీల్లో పాల్గొన్న వారంతా చక్కటి ముగ్గులు వేశారు. విజేతలను ఎంపిక చేయడానికి చాలా సమయం పట్టింది. చెప్పాలంటే అందరూ చాలాబాగావేశారు. పండుగల నేపథ్యం,ముగ్గులకు సంబంధించిన మెసెజ్‌అంశాలను పరిగణలోకితీసుకొని విజేతలను ఎంపిక చేశాం.



● అందరూ ముగ్గులు బాగా వేశారు..
-కళ్యాణి, డీఐఈవో, (న్యాయ నిర్ణేత)
పోటీలో అందరూ చక్కటి ముగ్గులు వేశారు. విజేతలను ప్రకటించటం కష్టతరమైనప్పటికీ కూడా పలు అంశాలను పరిగణలోకి తీసుకొని అందమైన ముగ్గులను ఎంపిక చేశాం. ఇలాంటి ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్న 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' వారికి ప్రత్యేక ధన్యవాదాలు



● సంస్కృతులను కాపాడుకోవచ్చు..
-రీనా బిల్వాల్, స్పర్శ మేనేజర్, (న్యాయ నిర్ణేత)
'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్' ముగ్గుల పోటీలు నిర్వహించటం చాలా సంతోషం. ఇలాంటి పోటీలతో మన సంస్కృతీ సంప్రదాయాలు పదికాలాల పాటు కాపాడుకున్నవారమవుతాం. విజేతలను ఎంపిక చేయటం చాలా కష్టమైనప్పటికీ న్యాయపరంగా ఎంపిక చేశాం.



ఆదివాసీల సంక్షేమమే ధ్యేయం: ఎస్సై

వాంకిడి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల సంక్షేమమే పోలీసుల ధ్యేయమని ఎస్సై ప్రశాంత్ అన్నారు. పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని చౌపన్‌గూడ గ్రామంలో ఆదివాసీ కుటుంబాకులకు దుప్పట్లు, 2క్వింటాళ్ల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చలితీవ్రతతో ఇబ్బందులు పడుతున్న గిరిజనులకు ఉయోగపడే విధంగా దుప్పట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసీ గిరిజనుల కోసం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న హమాలీల సమ్మె

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పెరిగిన ధరల ప్రకారం హమాలీలు చార్జీలు చెల్లించాలని కోరుతూ సివిల్ సప్లయి హమాలీలు మార్కెట్‌కమిటీ ఆవరణలో చేపట్టిన దీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం నాటికి 5వ రోజుకు చేరుకున్నాయి. వీరికి ఏఐటీయూసీ నాయకులు మద్దతు తెలిపారు.

'పది' విద్యార్థులకు అల్పాహారం

పెంచికలపేట, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, చెడ్వాయి ఉన్నత పాఠశాలలో ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్ సోమవారం నుంచి పదవ తరగతి విద్యార్థులకు ఉదయం అల్పాహారం, సాయంత్రం స్నాక్స్ అందించే ఏర్పాట్లు చేశారు. పరీక్షలు పూర్తయ్యే అల్పాహారం అందించనున్నట్లు కాంగ్రెస్ నాయకులు కృష్ణ, రాజన్న, శంకర్ గౌడ్ తెలిపారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే

సిర్పూర్(టి), జనవరి 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీకాలనీ, బెస్తవాడ, తదితర ఏరి యాల్లో ఆదివారం ఎంపీడీవో సత్యనారాయణ ఇందిరమ్మఇళ్ల సర్వేను నిర్వహించారు. మండలంలో అన్ని గ్రామాల్లో జరుగుతున్న సర్వేలో తప్పిపోయిన వారు ఎవరైనా ఉంటే పంచాయతీ కార్యదర్శులకు ఆధార్, రేషన్‌కార్డు, కరెంటు బిల్లు, పూర్తివివరాలు తెలియజేసి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

మాలిసంఘం ఎన్నికల నామినేషన్ స్వీకరణ

కౌటాల, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మాలి సంఘం ఎన్నికల నిర్వహణకు ఆదివారం నామినేషన్ స్వీకరించారు. ఆ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆడె వసంత్ తన నామినేషన్‌ను ఎన్నికల కమిటీ సభ్యుడు పాండు రంగకు అందజేశారు.

కాంగ్రెస్‌లో చేరిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. తిర్యాణి మాజీఎంపీపీ ఆత్రం లక్ష్మణ్, కేసీఆర్ సేవాదళం జిల్లా అధ్యక్షుడు తారీక్‌తోపాటు ఆయా మండలాల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వా నించారు. అనంతరం ఆసిఫాబాద్ మాజీఎంపీపీ బాలేశ్వర్‌గౌడ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఆయనకు కాంగ్రెస్‌పార్టీ నాయకులు జన్మదిన శుభా కాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మసాదే చరణ్, మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గౌడ్, నాయకులు మునీర్, శ్యాం, అసద్, రఫీక్, కలీం, తదితరులు పాల్గొన్నారు.

జైనూర్: ఆసిఫాబాద్ మాజీఎమ్మెల్యే ఆత్రంసక్కు వర్గీయులు ఆదివారం డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసా ద్‌రావ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు మండల పార్టీ అధ్యక్షుడు అబ్దుల్ ముకీద్ తెలిపారు. మండల మాజీ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, పార్టీసీనియర్ నాయకులు మేస్రాం అంబాజీ రావ్, పెందుర్ లచ్చు, పెందుర్ లాల్‌షావ్, మాజీ సర్పం చులు సవిత రాందాస్, గేడాం సత్యభామ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.


కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న విశ్వప్రసాద్‌రావు, ఆత్రం సక్కు

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

● ఎమ్మెల్యే కోవ లక్ష్మి


పాదుక దర్శనం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. అనంత శ్రీవిభుషిత రామానందచార్య పాదుక దర్శన కార్యక్రమం కరపత్రాలను ఆదివారం తన నివాసంలో నిర్వాహకులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాకేంద్రంలోని ప్రేమలాగార్డెన్ సమీపంలో ఈనెల 17న పాదుక దర్శన కార్యక్రమం నిర్వహిస్తామని పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నిర్వహకులు దిలీప్ గైక్వాడ్, బాలాజీ, పండరి, నిరక్షక్ తదితరులు పాల్గొన్నారు.

దేవుగూడను సందర్శించిన ఎమ్మెల్యే..

జైనూర్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆదివారం మండలంలోని దేవుగూడ గ్రామాన్ని సందర్శించారు. ఇటీవల జైనూరు ఘటనలో హత్యాచారయత్నానికి గురైన మేస్రాం నీలబాయితో మాట్లాడారు. ఆమె ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆమెను పరామర్శిం చేందుకు నేడు సోమవారం తెలంగాణ జనజాగృతి అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రానున్నారని నాయకులు, గ్రామస్థులకు చెప్పారు. ఎమ్మెల్సీ కవిత బాధితు రాలు నీలబాయిని పరామర్శించి తక్షణ సహాయం కింద 2లక్షల రుపాయల ఆర్థికసాయం అందజేస్తారని తెలిపారు. జైనూరు ఘటన పూర్వపరాలను గ్రామస్థులను అడిగి తెలుసుకుంటారన్నారు. ఎమ్మెల్సీ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల సహకార చైర్మన్ కొడప హన్నుపటేల్, బీఆర్‌ఎస్ మండల పార్టీ ఉపాధ్యక్షుడు ఆత్రం శంకర్, మాజీ సర్పంచులు మడావి భీంరావ్, మేస్రాం రాహుల్, కుంర శాంరావ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల దీక్ష

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు చేపట్టిన దీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం నాటికి దీక్షలు 27వ రోజుకు చేరుకోగా దీక్షా శిబిరాన్ని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి, రిటైర్డ్ ఆర్‌జేడీ ఎల్ సుహాసిని సందర్శించి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శృతిక, తుకారాం, నాగేష్, పవన్‌కుమార్, నలంద, అరుణ, మీనా, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.


ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులకు మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి సుహాసిని

ఏజెన్సీ గ్రామాలు గజగజ

ఆసిఫాబాద్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చలితీవ్రత ఒక్కసారి పెరగడంతో ఏజెన్సీ గ్రామాలు చలికి వణుకుతున్నాయి. సిర్పూర్(యు) మండలంలో 6డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదయింది. అలాగే తిర్యాణి మండలంలోని గిన్నెధరి గ్రామంలో 6.1డిగ్రీలు, తిర్యాణిలో 7.3డిగ్రీలు, వాంకిడి, కెరమెరిలలో 7.6డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

ఇద్దరిపై కేసు నమోదు

దహెగాం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వాడ గ్రామానికిచెందిన ఇస్లావత్ గోపాల్, గుగులోత్ లలితపై కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఆదివారం వారి ఇళ్లలో సోదాలు నిర్వహించగా బెల్లం పానకం, మూడు లీటర్ల గుడుంబా లభించినట్లు తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు భద్రతపై అవగాహన

బెజ్జూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని ఆసిఫాబాద్ ఏఎంవీఐ చంద్రశేఖర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, హెల్మెట్ ధరించాలని, వాహన పత్రాలు కలిగి ఉండాలన్నారు. మితిమీరిన వేగంగా ప్రమాదకరమన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సంతోష్ ఉన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేత


ఆర్థిక అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఆసిఫాబాద్‌రూరల్/లక్సెట్టిపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ మడావి ఆనంద్‌కుమార్ గత నవంబరు 4న మృతిచెందగా తోటి బ్యాచ్‌మేట్స్, మంచిర్యాల పోలీసుమిత్ర అసోసియేషన్ 2012 యూనియన్ సభ్యులు రూ.3లక్షల ఆర్థికసాయాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి చెక్ రూపంలో అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు మొగిలి, మల్లేష్, వెంకటేశ్వర్లు, రమేష్, దేవేందర్, సురేష్, విశ్వనాథ్, నాగోరావు, తానాజీ, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

భరోసా కేంద్రాన్ని సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి


రికార్డులను పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి యువరాజా

ఆసిఫాబాద్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని భరోసా కేంద్రాన్ని ఆదివారం సీనియర్ సివిల్‌జడ్జి యువరాజా సందర్శించారు. ఈ సందర్భంగా భరోసా కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. అంతకుముందు కోర్టు ఆవరణలో బాలలహక్కుల పరిరక్షణపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలహక్కుల పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి అనంతలక్ష్మి, డీడబ్ల్యూవో భాస్కర్, డీసీపీవో మహేష్, న్యాయవాదులు వెంకటేశ్వర్లు, డీసీఆర్బీ సీఐ శ్రీధర్ ఆయాశాఖల సిబ్బంది పాల్గొన్నారు.

నాడు కళకళ.. నేడు వెలవెల..


వర్షాకాలంలో నిండుగా ప్రవహిస్తున్న ప్రాణహిత(ఫైల్)

చింతలమానేపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడెం గ్రామ సమీపంలోని ప్రాణహితనది వర్షాకాలంలో నిండు కుండలా కనిపించగా.. ప్రస్తుతం పూర్తిగా నీటిమట్టం తగ్గి బండరాళ్లు కనిపిస్తు న్నాయి. నీటిమట్టం పూర్తిగా తగ్గడంతో ప్రాణహితనదిలోకి పలువురు వెళ్లి అక్కడి ఆహ్లాదకర వాతావరణాన్ని ఎంజాయ్ చేస్తున్నారు. ఇప్పటి నుంచి వర్షాకాలం వరకు ప్రాణహితలో నీటి మట్టం తగ్గి ఉంటుందని శీతాకాలం, ఎండాకాలం ఇక్కడ వాతావరణ పరిస్థిలు ఆహ్లాదకరంగా ఉంటాయనిస్థానికులు చెబుతున్నారు.


ప్రస్తుతం నీరు తగ్గి కనిపిస్తున్న బండరాళ్లు

క్రికెట్ అకాడమీని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏసీపీ రవికుమార్

బెల్లంపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లిలో ఏర్పాటు చేసిన మురళీ మెమోరియల్ క్రికెట్ అకాడమీని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఏసీపీ రవికుమార్ పేర్కొన్నారు. ఆదివారం అకాడమీలో మొదటి బ్యాచ్ శిక్షణను ప్రారంభించి మాట్లాడారు. క్రికెట్ అకాడమీ వల్ల క్రీడాకారులు మరింత రాణించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ ప్రాంతంలో క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత మాట్లాడుతూ క్రికెట్ అకాడమీకి తగిన సహాయం సహకారాలు అందిస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు స్వామి, శ్రీధర్, లయన్స్‌క్లబ్ సభ్యులు రాజమల్లు, అకాడమీ కో ఆర్డినేటర్ అల్లం వెంకటేశ్వర్లు, ఒకేషనల్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజేష్, సభ్యులు పైడిమల్ల నర్సింగ్, రాజేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ అందుకున్న శ్రీకాంత్‌రెడ్డి



డాక్టరేట్ అందుకుంటున్న ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి

జన్నారం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): జన్నారం లయన్స్‌క్లబ్ పూర్వాధ్యక్షుడు, ప్రస్తుత రీజియన్ చైర్మన్, స్లేట్ గ్రూప్ ఆఫ్ స్కూల్ చైర్మన్ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి మేరీల్యాండ్ యూనివర్శిటీ యూఎస్‌ఏ ద్వారా గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. ఆదివారం న్యూఢిల్లీలోని ఇండియా హాబిటాట్ సెంటర్‌లో జరిగిన కాన్వొకేషన్‌లో చీఫ్ గెస్ట్ జస్టిస్ జేడుఖాన్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. శ్రీకాంత్‌రెడ్డి విద్య, సామాజిక సేవ, యువత అభివృద్ధికి చేసిన కృషికి గుర్తింపుగా ఆయనకు డాక్టరేట్ లభించింది.

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం



పోలీసు జట్టుకు కప్పు అందజేస్తున్న సివిల్ జడ్జి ముఖేష్

బెల్లంపల్లి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి ఎంతో దోహదపడతాయని సివిల్ జడ్జి ముఖేష్, ఏసీపీ రవికుమార్‌లు అన్నారు. ఆదివారం ఏఎంసీ క్రీడా మైదానంలో న్యాయవాదులకు, పోలీసుల మధ్య ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రతీ ఒక్కరు ఒత్తిడికి లోనవుతారని, క్రీడలతో ఒత్తిడి దూరమవుతుందని, స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందన్నారు. క్రీడలతో మానసికంగా దృఢంగా తయారవుతారని పేర్కొన్నారు. పోలీసు జట్టు విజయం సాధించింది. సీఐలు దేవయ్య, కుమారస్వామి, అఫ్జలోద్దీన్, న్యాయవాదులు చిప్ప మనోహర్, రవి, మాదురి రాకేష్‌తో పాటు సబ్ డివిజన్‌లోని ఎస్సైలు, పోలీసు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీ గెడెం నగేష్

జన్నారం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : రాఘవేంద్ర గ్రూప్స్, మెడిలైఫ్ ఆసుపత్రి అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ ఎంపీ గెడెం నగేష్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా సాధించవచ్చని, ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దన్నారు. రాఘవేంద్ర గ్రూప్స్, మెడిలైఫ్ యాజమాన్యం ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. వైద్య శిబిరాన్ని లక్సెట్టిపేట జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మహమ్మద్ అసదుల్లా షరీఫ్ సందర్శించారు. ఎర్ర చంద్రశేఖర్, మధుసూదన్‌రావు, ముజాఫర్ అలీఖాన్, గడికొప్పుల కిరణ్, పాల్గొన్నారు.

ముగిసిన కేఎంపీఎల్ వేలం పాట

కాసిపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈ నెల 19 నుంచి నిర్వహించే కాసిపేట మండల్ ప్రీమియర్ లీగ్ సీజన్ 3 క్రికెట్ పోటీల కోసం ఆదివారం మందమర్రిలోని ఎల్లందు క్లబ్‌లో వేలం పాట నిర్వహించారు. 180 మంది క్రీడాకారులు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోగా ముంబై హీరోస్, పల్లంగూడ టైటాన్స్, చెన్నై సూపర్ కింగ్స్, సోల్జర్ బ్రేవ్ హార్టెడ్, రాయల్ చాలెంజర్స్, సన్ రైజర్స్, స్మార్ట్ కూల్ సిస్టం, పవర్ హిట్టర్, గోవా సూపర్ కింగ్స్, మాస్టర్ బ్లాస్టర్స్ పది ఫ్రాంఛైజీలు వేలం పాటలో పాల్గొన్నాయి. ఈనెల 19 నుంచి ప్రీమియర్ లీగ్ కాసిపేట మండల కేంద్రంలోని బీఆర్ అంబేద్కర్ మైదానంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు దాసరి శంకర్, నామసాని రాజు, శ్రీనివాస్, కంపం తిరుపతిలు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

కౌటాల, జనవరి 5(ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం బోదంపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్(23) అనే యువకుడు సెల్ఫీ తీసుకుంటూ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. దీనికి ప్రేమ వ్యవహారమే కారణమని తెలుస్తోంది. వెంకటేష్ అదే గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమించగా పెళ్లి విషయంలో యువతి వైపు పెద్దలు నిరాకరించారు. దీంతో ఆదివారం ఉదయం వెంకటేష్ ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఇంటికి వచ్చిన కుటుంబసభ్యులు గమనించి వెంటనే కౌటాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఈసుగాం ఆసుపత్రికి తరలించారు. వెంకటేష్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు పేర్కొంటున్నారు.

పెయింటర్స్ సంక్షేమానికి కార్మిక శాఖ చొరవ చూపాలి

గర్మిళ్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : పెయింటర్స్ సంక్షేమానికి కార్మిక శాఖ చొరవ చూపాలని రాష్ట్ర కన్‌స్ట్రక్షన్ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర ఇన్‌చార్జీ ఆకుల శంకర్, బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి కంది శ్రీనివాస్, రాష్ట్ర సంఘటన కార్యదర్శి రాంమోహన్‌లు పేర్కొన్నారు. ఆదివారం బీఎంఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కమలాకర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఈ నెల 29న సిద్దిపేటలో నిర్వహించే రాష్ట్ర మహాసభలకు కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి రాజుయాదవ్, కన్వీనర్ రామకృష్ణ, కో కన్వీనర్‌గా స్వామి, పెయింటర్స్ కార్మికులు పాల్గొన్నారు.



చెన్నూరులో బర్డ్‌వాక్, జన్నారంలో బర్డ్‌వాచ్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. పర్యాటకులకు కనువిందు చేసిన పక్షులు

నెలాఖరులోగా ఆసుపత్రి భవనం పూర్తిచేయాలి

లక్సెట్టిపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్మిస్తున్న ఆసు పత్రి భవనం నెలాఖరులోగా అందజేయాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదే శించారు. ఆదివారం ఆసుపత్రి భవన నిర్మాణం పనులను కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ డిసెంబరులో అప్పగించాలని తెలిపామని, వెంటనే కాంట్రాక్టర్‌తో పాటు అధికారులు పనుల్లో వేగం పెంచి భవనం వెంటనే అప్పగించే ఏర్పాట్లు చేయా లన్నారు. ఆసుపత్రి భవనానికి తెలుపు రంగు వేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పనుల్లో నాణ్యత ఉండాలని, ప్రహరీ పనులు పూర్తి చేయాలన్నారు. మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఆరీఫ్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెల్ల నాగభూషణ, కోఆప్షన్ షాహీద్, నాయకులు గడ్డం త్రిమూర్తి, పింగిళి రమేష్, ఇంజనీరింగ్ డిపార్టుమెంట్ మోబీన్, కాంట్రాక్టర్ సలావొద్దిన్‌తోపాటు నాయకులు గోప చిన్న రమేష్, కాంతయ్య, చంద్రమౌళి, కందుల మోహన్, లచ్చన్న, రాజు, అమీర్, శ్రీధర్ పాల్గొన్నారు.



ఆసుపత్రి నిర్మాణ పనులు పరిశీలించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

హాజీపూర్, (ఆంధ్రజ్యోతి): గుడిపేటలో నిర్మిస్తున్న కేంద్రీయ విద్యాలయం భవన నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. ఆదివారం కేంద్రీయ విద్యాలయం భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భవనం త్వరగా అందుబాటులోకి వచ్చేలా కృషి చేస్తామన్నారు. మిగిలిన పనులను నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

నీరుకుళ్ళ ఆలయంలో మంచిర్యాల జడ్జి పూజలు

సుల్తానాబాద్, జనవరి 5: (ఆంధ్రజ్యోతి): నీరుకుళ్ల రంగనాయక స్వామి వారి దేవాలయాన్ని మంచిర్యాల జిల్లా జడ్జి అర్పిత ఆదివారం సందర్శించారు. జిల్లా జడ్జికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. జడ్జి మాట్లాడుతు నీరుకుళ్లలోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన రంగనాయక స్వామి ఆలయ చరిత్రను, విశిష్టతను తెలుసుకోవడం జరిగిందని, ధనుర్మాసంలో సందర్శించడం ప్రాముఖ్యత ఉండడం వల్లన దర్శనం కోసం వచ్చినట్లు వివరించారు.

ఎక్స్‌గ్రేషియా అందజేయాలి

లక్సెట్టిపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పాత మామిడిపల్లికి చెందిన పత్తిపాక వెంకటేష్ 2023లో ఉపాధి కోసం సౌదీ వెళ్లాడు. గతేడాది జూలైలో అక్కడే బ్రెయిన్ డెడ్‌తో మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావుకు వినతిపత్రం అందజేశారు, కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు.

అంబేద్కర్ పట్టణ కమిటీ రద్దు

లక్సెట్టిపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): లక్సెట్టిపేట అంబేద్కర్ పట్టణ కమిటీని రద్దు చేసినట్లు సంఘం మండల అధ్యక్షుడు ముల్కల్ల రాందాస్ తెలిపారు. అంబేద్కర్ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘ సభ్యుల నిర్ణయం మేరకు రద్దు చేశామన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం పట్టణ కమిటీ సభ్యులు వ్యవహరిస్తున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. సభ్యులు పాల్గొన్నారు.

సీపీఐ సదస్సును విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కలవేన శంకర్

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సీపీఐ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 22న మంచిర్యాలలో నిర్వహించే సీపీఐ సదస్సును విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్ అన్నారు. ఆదివారం సీపీఐ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఐ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశమంతా ఉత్సవాలను నిర్వహిస్తోందన్నారు. సీపీఐ పార్టీ కార్మికులు, ప్రజల సంక్షేమానికి అనేక పోరాటాలు చేసిందన్నారు. సదస్సును నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు లక్ష్మణ్, పూర్ణిమ, దాసు, మల్లయ్యనగేష్, శ్రీనివాస్, రవి, నర్సయ్య, లక్ష్మీనారాయణ, సంతోష్, పాల్గొన్నారు.

బతుకమ్మ ఆడుతూ ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన

నస్పూర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె ఆదివారం నాటికి 27వ రోజుకు చేరింది. కలెక్టరేట్ ఎదుట బతుకమ్మ ఆడుతూ నిరసన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన హక్కులను ప్రభుత్వం పరిష్కారం చేయాలని జేఏసీ అధ్యక్షురాలు సుమలత, ప్రధాన కార్యదర్శి రాజన్నలు కోరారు. శిబిరాన్ని ఆదివాసీ తుడుం దెబ్బ రాష్ట్ర నాయకులు రవీందర్, రెడ్డి సమ్మన్న, రవి, సుధాకర్, జైపాల్ తదితరులు సందర్శించి మద్దతు పలికారు.



కలెక్టరేట్ ఎదుట బతుకమ్మ ఆడుతూ నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

మందమర్రి కాల్పులకు 46 ఏండ్లు

మందమర్రి టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మందమర్రిలో దొరల దురహంకారానికి వ్యతిరేకంగా కార్మిక వర్గం, ప్రజలు చేసిన తిరుగుబాటుకు 46 ఏండ్లు గడుస్తున్నాయి. అయినప్పటికీ నాటి జ్ఞాపకాలను ఇప్పటికీ గుర్తు చేసుకుంటారు. దొరల దౌర్జన్యాలను నిరసిస్తూ 1980 జనవరి 6న ర్యాలీ చేపట్టారు. పాత బస్టాండ్‌లో కల్లు గోదాంల మీద దాడి చేసి తగులబెట్టారు. దీంతో బెల్లంపల్లి నుంచి పోలీసు బెటాలియన్‌లు లాఠీచార్జి చేశారు. పలువురికి గాయాలు కావడంతో ఆగ్రహించిన ఆందోళనకారులు సినిమా టాకీస్‌కు నిప్పంటించడంతో పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ముగ్గురు మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. ఊరు మందమర్రికి చెందిన ఓ కార్మికుడు పోషం కాలులో ఇంకా తూటా అలాగే ఉంది. మరో కార్మికుడికి బుల్లెట్ తగిలి గాయమైంది. అప్పటి ప్రభుత్వం దీనిని సీరియస్‌గా తీసుకుంది. పోరాటానికి సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు దివంగత వీటీ అబ్రహం, మునీర్ నాయకత్వంలో జరిగిందని చెబుతుంటారు. దొరల దౌర్జన్యాన్ని తట్టుకోలేకనే ఓపిక నశించిన ప్రజలు దీనిపై తిరుగుబాటు చేశారు. జిల్లాలో ఈ పోరాటం ఒక కొంత ప్రజా చైతన్యానికి నిదర్శనంగా నిలిచింది.

హెడ్మాస్టర్‌తో విద్యార్థి కాళ్లు మొక్కించడం నీచమైన చర్య

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : హెడ్మాస్టర్‌తో విద్యార్థి కాళ్లు మొక్కించడం నీచమైన చర్య అని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దుర్కె మోహన్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాజవేణు, సామాజిక న్యాయవేదిక జిల్లా కన్వీనర్ రంగు రాజేశంలు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో వారు మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా తుక్కుగూడెంలో డిసెంబరు 21న హెడ్మాస్టర్ రాములుపై 50 మంది మతోన్మాద దుండుగులు దాడి చేసి విద్యార్థి కాళ్లు మొక్కించడం హేయమైన చర్య అన్నారు. ఘటనకు కారణమైన ప్రతీ ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇందుకు ఉన్నతాధికారులు స్పందించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు రవి, శ్రీనివాస్, రాములు, సత్యం, కనకరాజు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కలల నెరవేరిన వేళ..

- డీఎస్సీలో ఉద్యోగం సాధించి మొదటిసారి జీతం తీసుకున్న టీచర్లు
- కలల వేతనం... కన్నవారికి



బెజ్జూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): వారంతా కష్టపడ్డారు. చదువుకోవడానికి వారి అమ్మానాన్నలు ప్రోత్సాహాన్ని అందించారు. వారి ఆశలను నిజం చేస్తూ కోరుకున్న వృత్తిలో చేరి కన్నవారి కలలను నిజం చేశారు. 2024 డీఎస్సీలో టీచర్లుగా ఎంపికైన అభ్యర్థులు అక్టోబరు 16న ఉద్యోగంలో జాయిన్ అయ్యారు. సాంకేతిక సమస్యలతో అక్టోబర్, నవం బర్ నెలజీతం ఇంకా ఇవ్వలేదు. కాగా డిసెంబరు జీతం ఈనెల జనవరి 1న అందుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా తమ తొలివేతనాన్ని అమ్మానాన్నకు ఇచ్చి వారి కళ్లల్లో ఆనందాన్ని చూడాలని వారు భావిస్తున్నారు. ఈ మేరకు బెజ్జూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా విధుల్లో చేరినవారు తమ మనోభావాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

అమ్మానాన్నకు బంగారం కొనిపెడతా..



ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా కుశ్నపల్లి యూపీఎస్ పాఠశాలలో విధుల్లో చేరాను. నాకు వచ్చిన తొలివేతనంతో అమ్మానాన్నకు బంగారం కొనిపెడతాను. వారి ప్రోత్సాహంతోనే నేను ఈరోజు ఉపాధ్యాయురాలిగా ఉన్నాను. డీఎస్సీ ఫలితాలు వచ్చిన రోజున వారి కళ్లలో ఆనంద బాష్పాలు చూశాను. వారి ప్రోత్సాహం, ఆశీస్సుల వల్ల నాకు ఉద్యోగం లభించిందని భావిస్తున్నాను.

- ధరావత్ ప్రియాంక, ఎంపీయూపీఎస్, కుశ్నపల్లి

అమ్మానాన్నకు ఇస్తాను..



నాకు ప్రభుత్వ ఉద్యోగం రాగానే అమ్మానాన్నలు ఎంతో సంతోషపడ్డారు. ఉపాధ్యాయురాలిగా నాకు వచ్చిన తొలివేతనాన్ని అమ్మానాన్నకు ఇస్తాను. నన్ను ఎంతో కష్టపడి చదివించి ఈ స్థాయికి తీసుకవచ్చిన అమ్మానాన్నకు ఎంత ఇచ్చినా తక్కువే.

- శ్రీరామోజు అపర్ణ, ఎంపీపీఎస్, బెజ్జూరు

కొత్త బట్టలు కొనిస్తాను..



నాకు ఉద్యోగం రాగానే తొలివేతనంతో అమ్మానాన్నకు కొత్త బట్టలు కొనిపెడతాను. తిరుపతికి వెళ్లి వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటాను. టీచర్ ఉద్యోగం రాగానే మా తల్లిదండ్రులు ఎంతో సంతోషపడ్డారు.

- రాథోడ్ సువర్ణ, ఎంపీపీఎస్, చిన్నసిద్దాపూర్



సింగరేణి సమాచారం

ఆలయాల పేరిట చందాల వసూలు సరికాదు

- హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్

మంద మర్రి టౌన్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో గుర్తింపు సంఘాలు ఆలయాలపేరిట చందాల వసూలు చేయడం సరికాదని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్‌అహ్మద్ అన్నారు. ఆదివారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ కార్మికులు ప్రాణాలను పనంగాపెట్టి అనేకసమస్యలతో సతమతమవుతుంటే పట్టించుకోని సంఘాలు వారివేతనాల నుంచి 1850కోడ్ బూచిగా చూపి డబ్బులు ఎలా రికవరీ చేస్తారన్నారు. దీనికి యాజమాన్యం ఎలా సహకరిస్తుందని ధ్వజమెత్తారు. ఇన్‌కం టాక్సుపై నోరుమెదపని ఈరెండు సంఘాలు వారి అనుమతులు లేకుండా రూ.500 దండుకోవడం క్షమించరాని నేరమన్నారు. దీనిని హెచ్ఎంఎస్ చూస్తూ ఊరుకోదన్నారు. వారం రోజుల్లో దీనిపై ఓ కార్యాచరణతో ముందుకు వెళ్తామని తెలిపారు.

పశువులకు గ్రాసం కరువు

- మహారాష్ట్ర నుంచి కొని తెస్తున్న రైతులు

వాంకిడి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పశుగ్రాసంకోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో రైతులు ఎక్కువగా పత్తి, కంది పటలు సాగుచేస్తుడంతో పశుగ్రాసం కొరత ఏర్పడుతోంది. గతంలో ఎక్కువగా జొన్న పంటను పండించే రైతులు పదేళ్లనుంచి పత్తి, కందిపంటను పండిస్తున్నారు. దీంతో జొన్నసాగు తగ్గి పశుగ్రాసం కొరత తీవ్రంగా ఏర్పడింది. ప్రతి సంవత్సరం మండల రైతులు పక్క రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి వరిగడ్డని కొనుగోలు చేస్తున్నారు. మహారాష్ట్ర లోని వివిధ ప్రాంతాల నుంచి కేవలం పికప్ వాహనంలో వచ్చేంత గడ్డికే రూ.5నుంచి 6వేలు చెల్లించి తీసుకువస్తున్నారు.

- ఎండు గడ్డికి గడ్డుకాలం..

జిల్లాలో దాదాపు 55వేల ఎకరాలకు పైగా వరిపంటను రైతులుసాగుచేస్తున్నారు. కూలీల కొరత కారణంగా యంత్రాలు ఉపయోగించడంతో పశువులకు మేత కరువైంది. యంత్రాల వాడకం ఎక్కువకావడంతో 60శాతం మాత్రమే వరిగడ్డి వస్తుండడంతో పశుగ్రాసం కొరత ఏర్పడుతోంది. ప్రభుత్వం రాయితీపై గడ్డి విత్తనాలు సరఫరా చేయకపోవడంతో పాడి, వ్యవసాయం కోసం పశువులు ఉన్న రైతులు పశుగ్రాసం కోసం భారీగా డబ్బులు వెచ్చించాల్సి వస్తోంది. కొందరు రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో పశువులను విక్రయిస్తున్నారు. దీంతో గ్రామాల్లో పశువుల సంఖ్య కూడా తగ్గుముఖం పడుతోంది.



మహారాష్ట్ర నుంచి తీసుకువస్తున్న వరి గడ్డి

ఇప్పటివరకు 5,500క్వింటాళ్ల సోయా కొనుగోలు చేశాం..

- సహకార సంఘ సీఈవో సోనకాంబ్లే జనార్దన్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : సహకార సంఘం ద్వారా ఈ ఏడాది ఎన్ని క్వింటాళ్ల సోయా కోనుగోలు చేశారు?

సీఈవో: ఈ ఏడాది ఇప్పటి వరకు దాదాపు 5,500 క్వింటాళ్ల సోయా కోనుగోలు చేశాం.

ఆంధ్రజ్యోతి : సోయా విక్రయించిన రైతులకు డబ్బులు అందడంలో ఆలస్యం అవుతోందని రైతులు అంటున్నారు.. మీరేమంటారు?

సీఈవో: సహకారం సంఘం ద్వారా క్వింటాలుకు 4,892 ధరకు సోయా కోనుగోలు చేశాం. రైతుల బ్యాంక్ ఖాతాలోకి దశల వారీగా డబ్బులు జమ అవుతున్నాయి.

ఆంధ్రజ్యోతి : సోయా కొనుగోళ్లను ఎందుకు నిలిపి వేశారు. ఇంక సోయా విక్రయించేందుకు రైతులు వస్తున్నారు కదా?

సీఈవో: సోయా కోనుగోళ్ల ప్రక్రియను ప్రభుత్వం నిలిపి వేసింది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే మళ్లీ తప్పక కోనుగోళ్లను ప్రారంభిస్తాం.

భీమన్నదేవర జెండా పండుగను ఘనంగా నిర్వహించాలి

బెజ్జూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో ఈనెల 8న భీమన్న దేవర జెండా పండుగను ఘనంగా నిర్వహించాలని ఆదివాసీ నాయకులు కోరారు. ఆదివారం పండుగకు సంబంధించిన జెండాలను ఆదివాసీనాయకులు విడుదల చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు బక్కయ్య, రాజారాం, మల్లేష్, వెంకటేష్, గణేష్, మల్లేష్, శంకర్, ఆత్రం శంకర్, తిరుపతి, శ్రీదేవి, అమృత, పద్మ, మమత, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.


మంచిర్యాలలో మొదటి బహుమతి పొందిన ముగ్గు


మంచిర్యాలలో ద్వితీయ బహుమతి పొందిన ముగ్గు


మంచిర్యాలలో తృతీయ బహుమతి పొందిన ముగ్గు

అలరించిన రంగవల్లులు


మహిళలను ఉద్దేశించి మాట్లాడుతున్న మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్

5వ పేజీ తరువాయి..

జిల్లా నలుమూలల నుంచి మహిళలు తరలిరావడం అభినందనీయమన్నారు. విజేతలకు బహుమతులను స్పాన్సర్ చేసిన వారిని ఆయన అభినందించారు.

పోటీ పడి ముగ్గులు వేశారు...

ముగ్గుల పోటీలకు వచ్చిన మహిళలు పోటీలు పడి రంగవల్లులు వేయడం గొప్ప విషయమని జిల్లా షీ టీం ఎస్ఐ హైమ అన్నారు. మరుగున పడుతున్న సంప్రదా యాలను ఏబీఎన్-ఆంధ్రజ్యోతి వెలికితీయడం అభినందనీ యమన్నారు. కేవలం కుటుంబ బాధ్యతలకే పరిమితం కాకుండా పోటీల్లో పాల్గొనడం ఆనందాన్నిస్తున్నారు. ఆంధ్ర జ్యోతి యాజమాన్యం ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల చైర్మన్ సానా వెంకటేశ్వర్ రావు, కరస్పాండెంట్ గిరీశ్, ప్రిన్సిపాల్ సానా సుధతి, న్యాయనిర్ణేతలు జ్యోత్స్న చంద్రదత్, ఇరుకుల లత, కవిత, పొన్న స్వప్న, ఎ. సునీత, డాక్టర్ రజనీ, ఆంధ్ర జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ డేగ సత్యం, విలేకరులు సీహెచ్. జనార్దన్, పూరెళ్ల లక్ష్మణ్, కస్తూరి శ్రీనివాస్, బియ్యాల రాజ్ కుమార్, కేశిరెడ్డి నారాయణ రెడ్డి, తాండ్ర సతీష్, ఎనగందుల సత్యం, ఏబీఎన్ రిపోర్టర్ కె. శ్రీనివాస్, జిల్లా స్టాఫ్ కెమెరామెన్ రామంచ శ్రీనివాస్, అసిస్టెంట్ సర్క్యులేషన్ అధికారి గణేష్‌తో పాటు సెల్సియా కార్పొరేట్ స్పాన్సర్ నవీన్ కుమార్, పాఠశాల పీఈటీలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


కాగజ్‌నగర్‌లో ముగ్గులు వేస్తున్న మహిళలు

ప్రతీ సంవత్సరం పాల్గొంటున్నా...



ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించే సంక్రాంతి ముగ్గుల పోటీల్లో ప్రతీ సంవత్సరం పాల్గొంటున్నా, పోటీల్లో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉంది. రెండు సార్లు జిల్లాస్థాయిలో, ఒకసారి రాష్ట్రస్థాయిలో విజేతగా నిలవడం సంతోషంగా ఉంది. భవిష్యత్తులో ప్రతీ ఏడాది పోటీల్లో పాల్గొనేందుకు ప్రయత్నిస్తా.

- ప్రథమ బహుమతి విజేత శనిగారపు హేమలత

ముత్యాల ముగ్గుల పోటీల్లో పాల్గొనడం సంతోషం..



ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించే ముత్యాల ముగ్గుల పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది. ఒకసారి రాష్ట్రస్థాయి బహుమతి వచ్చింది. ఇలాంటి పోటీలు ఆంధ్రజ్యోతి నిర్వహించడం ఎంతో అభినందనీయం. రాష్ట్రస్థాయిలో విజేతగా నిలిచేవరకు పోటీల్లో పాల్గొంటూనే ఉంటా.

- గాదె లలిత, ద్వితీయ బహుమతి విజేత

విజేతగా నిలవడం ఆనందంగా ఉంది



ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించే ముత్యాల ముగ్గుల పోటీలకు క్రమం తప్పకుండా హాజరవుతున్నా. ఇప్పటి వరకు జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి, గతేడాది రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీల్లో ద్వితీయ స్థానం సాధించాను.

-తృతీయ బహుమతి విజేత, ఇందారపు వాణి

గెలుపోటములు సహజం



ఏ పోటీల్లోనైనా గెలుపోటములు సహజమేనని, పోటీల్లో పాల్గొంటున్నారంటే నైతికంగా విజయం సాధించినట్లే. ఇంటి బాధ్యతల్లో నిత్యం బిజీగా ఉండే మహిళలను ముత్యాల ముగ్గుల పోటీల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహిస్తున్న ఆంధ్రజ్యోతి కృషి అభినందనీయం. చిన్నారులు వేసిన ముగ్గులు బాల్యాన్ని గుర్తు చేశాయి.

- న్యాయనిర్ణేత జ్యోత్స్న చంద్రదత్


ప్రోత్సాహక బహుమతి అందిస్తున్న ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ సిబ్బంది


ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు, ఆంధ్రజ్యోతి సిబ్బంది



కాగజ్‌నగర్‌లో లోగోలు వేస్తున్న చిన్నారులు



మంచిర్యాలలో లోగోలు వేస్తున్న చిన్నారులు


ప్రోత్సాహక బహుమతి అందిస్తున్న షీ టీమ్ ఎస్ఐ హైమ



కాగజ్‌నగర్‌లో ప్రథమ బహుమతి పొందిన ముగ్గు


కాగజ్‌నగర్‌లో ద్వితీయ బహుమతి పొందిన ముగ్గు


కాగజ్‌నగర్‌లో తృతీయ బహుమతి పొందిన ముగ్గు

ప్రథమ బహుమతి వస్తుందని అసలు ఊహించలేదు..



సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి వస్తుందని అసలు ఊహించలేదు. సంక్రాంతి శోభ సంతరించుకుని వేసిన ముగ్గుకు బహుమతి రావడం సంతోషంగా ఉంది. ఇంతమంది పోటీదారుల్లో నాకు బహుమతి రావడం ఆనందంగా ఉంది. ఇలాంటి పోటీలు నిర్వహించి మహిళలను, యువతులను ప్రోత్సహించడం అభినందనీయం.

- బత్తుల సరిత, మొదటి బహుమతి విజేత, గోలేటి, మం.రెబ్బెన, కుమరం భీం ఆసిఫాబాద్

ఎంతో ఆనందంగా ఉంది..



ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీల్లో నాకు ద్వితీయ బహుమతి రావడం ఎంతో ఆనందంగా ఉంది. కాగజ్‌నగర్‌లో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలుసుకుని ఉదయాన్నే వచ్చాను. న్యాయనిర్ణేతలు తన ముగ్గుకు ద్వితీయ బహుమతి ఇవ్వడం ఆనందంగా ఉంది.

- పిడుగు జయ, ద్వితీయ బహుమతి, తిర్యాణి, కుమరం భీం ఆసిఫాబాద్


మహిళలను ప్రోత్సహించడం ఎంతో అభినందనీయం..



ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మహిళలు, యువతుల కోసం ముగ్గుల పోటీలు నిర్వహించడం అభి నందనీయం. అందరిలాగే పోటీల్లో పాల్గొని ముగ్గు వేశాను. బహుమతి వస్తుందని అనుకోలేదు. నాకు తృతీయ బహుమతి రావడం ఎంతో సంతృప్తినిచ్చింది. ముగ్గుల పోటీలు నిర్వహించిన ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ వారికి కృతజ్ఞతలు.

- దుర్గం సుమలత, తృతీయ బహుమతి, గోలేటి టౌన్ షిప్, మం.రెబ్బెన, కుమరం భీం ఆసిఫాబాద్


కాగజ్‌నగర్‌లో ముగ్గులు వేస్తున్న మహిళలు



క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

భీమారం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : భీమారం మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభించారు. మండలంలోని జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు మండల స్థాయి క్రికెట్ పోటలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజ్‌కుమార్ , లచ్చన్న, బాపు, ఆయా గ్రామాల క్రీడాకారులు పాల్గొన్నారు.



మంచిర్యాలలో ముగ్గులు వేస్తున్న మహిళలు

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలోని అభ్యాస స్కూల్‌లో, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్పీఎం క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన ముగ్గుల పోటీలు అలరించాయి. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. మంచిర్యాలలో జరిగిన పోటీలో 58 మంది పాల్గొని తమ ప్రతిభా పాటవాలను కనబరిచారు. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు....గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్...ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్ వేర్)...సహకారంతో ఈ పోటీలను నిర్వహించింది. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా నలుమూలల నుంచి 53మంది మహిళలు, యువతులు, చిన్నారులు పాల్గొన్నారు. మహిళలు తెలంగాణ, తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించేలా ముగ్గులు వేశారు. పాల్గొన్న ప్రతీ ఒక్కరికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు.

అలరించిన రంగవల్లులు

● మంచిర్యాల, కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు ● ఆనందోత్సాహాలతో పాల్గొన్న మహిళలు, యువతులు

మంచిర్యాల క్రైం/కలెక్టరేట్/గర్మిళ్ల/నస్పూర్/శ్రీరాంపూర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని అభ్యాస స్కూల్‌లో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలకు జిల్లా నలుమూలల నుంచి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలలో 58 మంది మహిళలు పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు....గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్... ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్ వేర్)...సహకారంతో ఈ పోటీలను నిర్వహించింది. పోటీల్లో ప్రథమ బహుమతి కింద రూ.6వేలు, ద్వితీయ రూ. 4వేలు, తృతీయ రూ. 3వేల నగదుతోపాటు పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ కన్సోలేషన్ బహుమతులు అందజేశారు.

విజేతలు వీరే...

మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగిన ముత్యాల ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతిని మందమర్రి పట్టణానికి చెందిన శనిగారపు హేమలత, ద్వితీయ జైపూర్ మండలం ఇందారం గ్రామానికి చెందిన గాదె లలిత, తృతీయ బహుమతిని మంచిర్యాల పట్టణానికి చెందిన ఇందారపు వాణి గెల్చుకున్నారు.

స్థానిక స్పాన్సర్లు వీరే....

ముగ్గుల పోటీలకు స్పాన్సర్లుగా ప్రథమ బహుమతి మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ నీలకంఠేశ్వరరావు (చార్వాక చారిటబుల్ ట్రస్ట్), ద్వితీయ డాక్టర్ రుద్రభట్ల రఘువంశీ (అవని చిల్డ్రన్స్ హాస్పిటల్), తృతీయ బహుమతి సాన సుధతి (అభ్యాస స్కూల్ ప్రిన్సిపాల్) అందించారు. కన్సోలేషన్ బహుమతులు పత్తి వెంకటేష్ (వస్త్ర వ్యాపారి), డాక్టర్ బుద్ధ ప్రవీణ్ (ప్రవీణ్ ఆర్థోపెడిక్ హాస్పిటల్)లు అందజేశారు. మహిళల్లో ఉత్సాహాన్ని నింపేందుకు వ్యాఖ్యాతగా స్కూల్ టీచర్ రోహిణి సంక్రాంతి విశిష్టతను తెలిపారు. మధ్యలో చలోక్తులు విసురుతూ నవ్వించారు. ముగ్గులు వేసే మహిళలను ఉత్సాహపరిచేందుకు పాటలు పాడుతూ, మహిళల గొప్పతనాన్ని వివరించారు.

ఆంధ్రజ్యోతి కృషి అభినందనీయం

సంక్రాంతి పండుగపూట మహిళలను ఉత్తేజపరిచేందుకు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేస్తూ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ చేస్తున్న కృషి అభినందనీయమని అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్ అన్నారు. పోటీలకు .....

వివరాలు 7, 8లో



అదనపు కలెక్టర్, స్పాన్సర్ల చేతుల మీదుగా ప్రథమ బహుమతి అందుకుంటున్న శనిగారపు హేమలత



ద్వితీయ బహుమతి అందుకుంటున్న గాదె లలిత



తృతీయ బహుమతి అందుకుంటున్న ఇందారపు వాణి



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

కష్టపడే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుంది



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

జన్నారం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడే ప్రతీ కార్యకర్తను గుర్తిస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ సయ్యద్ పసివుల్లాతోపాటు పది మంది డైరెక్టర్ల చేత ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పదవుల కోసం ఎవరూ నిరాశ పడవద్దని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు కార్యకర్తలకు అవకాశం కల్పిస్తామన్నారు. మార్కెట్ కమిటీ పాలకవర్గం సభ్యులు అధికారులను సమన్వయం చేస్తూ రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించారు. జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ షాబోద్దీన్, సెక్రెటరీ శ్రీనివాస్, మండల కాంగ్రెస్ ప్రెసిడెంట్ ముజాఫర్ అలీఖాన్, పొనకల్ సహకార సంఘం చైర్మన్ అల్లం రవి, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పీఎస్సార్‌ను కలిసిన టీఎన్‌జీవో నాయకులు

గర్మిళ్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావును ఆదివారం టీఎన్‌జీవో నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, రామ్మోహన్, మల్లయ్య, బాపురావు, తిరుపతి, సునీత, శ్రావణ్, గోపాల్, పాల్గొన్నారు.

రైతుభరోసా అమలు చేయాలని నిరసన



కొమ్మెర గ్రామంలో పోస్టర్లతో రైతులు

చెన్నూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అమలు చేయగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొర్రీలు లేకుండా రైతు భరోసా అమలు చేయాలని రైతులు పేర్కొన్నారు. శనివారం రాత్రి కొమ్మెరలో రైతులు గ్రామంలో పోస్టర్లను అంటించారు. వారు మాట్లాడుతూ ఎకరానికి రూ.17,500 చొప్పున రైతులకు బాకీపడిన రైతుభరోసా నిధులను వెంటనే ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.

రైతు, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రజాపాలన

గూడెం ఎత్తిపోతల పథకం నీటి విడుదల

దండేపల్లి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతు, ప్రజా సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తుందని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. సత్యనారాయణస్వామి ఎత్తిపోతల పథకం ద్వారా యాసంగి పంట కోసం గూడెం ఎత్తిపోతల నీటిని ఆదివారం కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల చీఫ్ ఇంజనీర్ బద్రినారాయణతో కలిసి పూజలు చేసి నీటిని విడుదల చేశారు.

సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో రైతుభరోసా పథకం ప్రారంభించను న్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. గూడెం ఎత్తిపోతల పథకం ఒక బృహత్తర పథకమని, ఆయకట్టు రైతులకు గూడెం ఎత్తిపోతల పథకం వరంలాంటిదన్నారు. వారబంధి పద్ధతిలో నీళ్లు అందిస్తున్నందున రైతులు పరస్పరం సహకరించుకోవాలన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే స్పందించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా యాసంగి పంటల సాగు కోసం మండలం తానిమడుగు డి30 నుంచి హాజీపూర్ మండలం డి42 డిస్ట్రిబ్యూటర్ వరకు సుమారు 17,500వేల ఎకరాల పంటలకు నీరు అందుతుందన్నారు. ఏప్రిల్ 27వరకు ఆరుతడి పంటలకు సాగునీరు అందిస్తామన్నారు. లక్షెట్టిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మ న్ దాసరి ప్రేమ్‌చందు, వైస్ చైర్మన్ ఎండి ఆరీఫ్, మాజీ ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ నాగరాణిత్రిమూర్తి, ఎంపీడీవో ప్రసాద్, డీటీ విజయ, నీటి పారుదల శాఖ ఎస్ఈ రవీందర్, డీఈలు దశరథం, వెంకటేశం, ఏఈలు రాజేందర్, జాకీర్, కీర్తి, సంజీవ్, శ్రావణి, నాయకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



తానిమడుగు నీటి డెలివరీ సిస్టం వద్ద నీటిలో పూలు చల్లుతున్న ఎమ్మెల్యే, కలెక్టర్

జన్నారం, చెన్నూరులో పర్యాటకుల సందడి

ఆకట్టుకున్న బర్డ్‌వాచ్, బర్డ్‌వాక్



కవ్వాల్ అభయారణ్యంలో గన్‌శెట్టికుంట వద్ద, కిష్టంపేట సమీపంలోని అంబేద్కర్ పార్కులో పర్యాటకులు, అటవీ శాఖ అధికారులు

జన్నారం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కవ్వాల టైగర్ జోన్‌లో బర్డ్‌వాచ్ పర్యాటకులను ఆకర్షించింది. ఆదివారం అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బర్డ్‌వాచ్‌కు 15 మంది పర్యాటకులు తరలివచ్చారు. శనివారం రాత్రి ఇందన్‌పల్లి రేంజ్‌లోని అటవీ ప్రాంతంలోని గన్‌శెట్టికుంట వద్ద ఏర్పాటు చేసిన గుడారాల్లో బస చేశారు. రాత్రి అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. గుడారాల వద్ద బస చేయగా ఆదివారం ఉదయం బర్డ్ వాచ్‌ను ప్రారంభించారు. కరీంనగర్, నిజామాబాద్‌తో పాటు వరంగల్‌ల నుంచి వచ్చిన పర్యాటకులు బర్డ్ వాచ్‌లో పాల్గొన్నారు. పర్యాటకులు వారి లెన్స్ ద్వారా పక్షులను వీక్షిస్తూ సంబరపడ్డారు. అటవీ శాఖ అధికారులు పక్షులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వోలు సుష్మారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెన్నూరు, (ఆంధ్రజ్యోతి): చెన్నూరు అటవీ రేంజ్ పరిధిలోని కిష్టంపేట, భీమారం మండలంలోని బూరుగుపల్లి అటవీ ప్రాంతంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో బర్డ్‌వాక్ కార్యక్రమం నిర్వహించారు. శనివారం సాయంత్రం కిష్టంపేటలోని అంబేద్కర్ ఈకో టూరిజం పార్కులో సందర్శకులు రిజిస్ట్రేషన్ చేసుకుని రాత్రి క్యాంప్ ఫైర్ నిర్వహించారు. ఆదివారం ఉదయం 5.30 గంటలకు కిష్టంపేట అర్బన్ పార్కు నుంచి సఫారీ వాహనాల్లో బూరుగుపల్లి సమీపంలోని గొల్లవాగు ప్రాజెక్టు చేరుకుని బర్డ్ వాచింగ్‌లో పాల్గొన్నారు. పలు రకాల పక్షులను గుర్తించారు. సందర్శకులు తమ కెమెరాల్లో పక్షుల ఫొటోలను తీసుకున్నారు. ప్రాజెక్టు రిజర్వ్ అడవిలో ఉండడంతో నీటిలో ఉండే పక్షులు, వృక్షాలపైన ఉండే పక్షులను సుమారుగా 120 వరకు గుర్తించారు. అక్కడి నుంచి కిష్టంపేట అర్బర్ పార్కులో పలు రకాల పక్షులు, సీతాకోకచిలుకలు ఉన్నట్లు రీసోర్స్‌పర్సన్ రాంజాన్ విరాని గుర్తించారు. మంచిర్యాల రేంజ్ అధికారి రత్నాకర్, చెన్నూరు అటవీ రేంజ్ అధికారి శివకుమార్, డీఆర్‌వో ప్రభాకర్, ఎఫ్ఎస్‌వోలు, ఎఫ్‌బీవోలు పాల్గొన్నారు.